సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 12 । మే । 2025

దారి కాచిన మృత్యువు



సెలవులకు ఇంటికి వస్తూ రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన ఓ తండ్రి, కూతురు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లాలో చోటు చేసుకుంది.

8లో▸



ఘనంగా పెర్సపేన్ పూజలు

వైశాఖమాసం పురస్కరించుకుని గిరి గ్రామాల్లో పెర్సపేన్ పూజలు మొదలయ్యాయి. పలుచోట్ల ఆదివాసీలు కులదేవతకు మొక్కులు చెల్లించారు.

9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0/27.0

పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

సైన్యానికి మద్దతుగా పూజలు



పూజలు చేస్తున్న ఎంపీ నగేశ్, నాయకులు

తాంసి: ఉగ్రవాద నిర్మూలనలో భాగంగా సరిహద్దులో పోరాటం చేస్తున్న భారత త్రివిధ దళాలకు, ఆపరేషన్ సిందూర్‌కు ప్రతి ఒకరూ మద్దతుగా నిలవాలని ఎంపీ గోడం నగేశ్ కోరారు. త్రివిధ దళాలకు మద్దతుగా మండలంలోని పొన్నారి సంకట్‌మోచన్ హనుమాన్ ఆలయంలో ఎంపీ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాక్ ఉగ్రవాదులు సరిహద్దు వెంట దాడులకు పాల్పడుతుండగా భారత త్రివిధ దళాలు ధీటుగా తిప్పికొడుతున్నాయన్నారు. ఇందులో మాజీ జెడ్పీటీసీ రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రకిరణ్, నాయకులు సదానంద్, అరుణ్, నారాయణ, ప్రవీణ్ రెడ్డి తదితరులున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- డీఎస్పీ జీవన్‌రెడ్డి



తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వడ్డెర కాలనీలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కమ్ కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇళ్లలో సోదాలు చేపట్టారు. కాలనీకి చెందిన ఒల్లెపు బాబన్న బైక్ నంబర్ మార్ఫింగ్ చేసి మరో నంబర్ బిగించినట్లు గుర్తించారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాలనీకి చెందిన దారంగుల గంగమ్మ ఇంట్లో సోదాలు చేయగా 17దేశీదారు బాటిళ్లతో పాటు ఒక బీర్ లభించినట్లు పేర్కొన్నారు. ఆమెపై కూడా కేసు నమోదు చేసినట్లు వివరించారు. స్క్రాప్ యజమానులు దొంగతనం చేసిన వస్తువులను కొనుగోలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెండు రోజుల పాటు ఆదిలాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని స్క్రాప్ దుకాణాలను తనిఖీ చేయగా, సర్వీస్ వైర్లు, అగ్రికల్చర్‌కు సంబంధించిన సబ్‌మెర్సిబుల్ మో టార్లు, కాపర్ తీగలు కొనుగోలు చేసినట్లు తేలిందన్నారు. తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఎవరైనా కాపర్‌వైర్లు, ఇతర వస్తువులు అమ్మడానికి వస్తే వారి వివరాలు, ఫోన్ నంబర్లు నమోదు చేయాలని సూచించారు. అలాగే దుకాణాల్లో సీసీ కెమెరాలు బిగించుకోవాలన్నారు. డీఎస్పీ వెంట టూటౌన్ ఎస్సైలు తిరుపతి, విష్ణుప్రకాశ్, హెడ్ కానిస్టేబుల్ బబిత తదితరులున్నారు.

ఎనిమిది కాళ్ల వింత మేకపిల్ల జననం



మృతిచెందిన ఎనిమిది కాళ్ల మేకపిల్ల

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బొక్కల్‌గూడలో నివాసం ఉంటున్న రాజలింగుకు చెందిన మేక ఆదివారం ఎనిమిది కాళ్లతో వింత మేకపిల్లకు జన్మనిచ్చింది. కొద్ది సేపటికే మృతి చెందింది. మేక ఈత కోసం యజమాని పశు వైద్యశాలకు తీసుకెళ్లాడు. వైద్యుడు దూద్‌రాం రాథోడ్ సిజేరియన్ అవసరం ఉందని గ్రహించి ఆపరేషన్ చేశాడు. ఒక తల, ఎనిమిది కాళ్లతో వింతగా జన్మించింది. జన్యులోపం కారణంగా ఇలాంటివి జన్మిస్తాయని, శాస్త్ర పరిభాషలో అక్టోగోట్ ఫీటస్, పాలిమేలియా అంటారని వైద్యుడు తెలిపారు. మేకకు శస్త్ర చికిత్స చేసిన వారిలో రాథోడ్ లావణ్య, సిబ్బంది ఉన్నారు.

సర్కారు బడి.. బాగుపడాలె



ప్రార్థన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

- వసతులున్నా విద్యార్థుల ప్రవేశాలు అంతంతే
- ‘ప్రైవేట్’ వైపే తల్లిదండ్రుల చూపు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- పేదలకు అందని నాణ్యమైన విద్య

జిల్లాలో..
డీఈవో పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు :657
(ఉన్నత :102, ప్రాథమికోన్నత:100, ప్రాథమిక :455)
2023–24లో విద్యార్థుల సంఖ్య :70వేలు
2024–25లో విద్యార్థుల సంఖ్య : 65వేలు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడులు బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మౌలిక వసతులు కల్పిస్తోంది. గతంలో మన ఊరు–మనబడి, ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట ప్రభుత్వం సౌకర్యాలు మెరుగుపర్చింది. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. బదిలీలూ చేపట్టింది. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను సైతం భర్తీ చేసింది. ఇక నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత గురువులపైనే ఉంది. అయితే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మాత్రం మెరుగుపడటం లేదు. అనేక కార్యక్రమాలు నిర్వహించినా ఆచరణలో పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోని పరిస్థితి. తల్లిదండ్రులకు సర్కారు బడులపై నమ్మకం ఇంకా రావడం లేదు. తమకు కష్టమైనా కూలీనాలి చేసి పిల్లలను ప్రైవేటు బడులకు పంపించేందుకు మొగ్గు చూపుతున్నారు. కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇతర వ్యాపకాల్లో ఉంటూ బోధనపై దృష్టి సారించకపోవడంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని తెలుస్తోంది. పర్యవేక్షణ లోపించడమే ఇందుకు కారణమనే విమర్శలున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

జిల్లాలో విద్యావ్యవస్థలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఐదేళ్లుగా జిల్లాకు రెగ్యులర్ విద్యాశాఖ అధికారి కరువయ్యారు. ఇదివరకు డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రవీందర్‌రెడ్డి ఎఫ్‌ఏసీ విధులు నిర్వహించగా, ఆ తర్వాత నిర్మల్ ఏడీగా కొనసాగిన ప్రణీత ఇక్కడ డీఈవోగా పనిచేశారు. ఆమె ఉద్యోగ విరమణతో ప్రస్తుతం వయోజన విద్య డీడీగా పనిచేస్తున్న అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. 18 మండలాల ఎంఈవోలకు గాను ఆదిలాబాద్ అర్బన్‌లో మాత్రమే రెగ్యులర్ ఎంఈవో ఉన్నారు. మిగతా 17 మండలాలకు సీనియర్ ప్రధానోపాధ్యాయులే ఎంఈఓలుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో చాలా మంది తాను పనిచేసే బడికి, ఇటు ఎంఈఓ పోస్టుకు న్యాయం చేయలేకపోతున్నారు. పాఠశాలలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయలేకపోతున్నారు. దీంతో కొంత మంది ఉపాధ్యాయులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. రెగ్యులర్ అధికారులు నియామకమైతే తప్పా విద్యా వ్యవస్థ గాడిన పడే పరిస్థితి లేదని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

వసతులున్నా.. మెరుగుపడని చదువులు

కార్పొరేట్, ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వం సర్కారు పాఠశాలలను బలోపేతం చేస్తుంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో ఐసీటీ ల్యాబ్‌లు, ఐఎఫ్‌పీ బోర్డులు, డిజిటల్, కంప్యూటర్ విద్య, ఇంటర్నెట్ సౌకర్యం, తాగునీరు, డ్యూయల్ డెస్క్‌లు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యంతోపాటు ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్నభోజనం, రాగిజావ ఇలా పూర్తిస్థాయిలో అన్ని వసతులను సమకూరుస్తోంది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు మాత్రం మెరుగుపడటం లేదని ఇటీవల పలు సర్వేల్లో తేటతెల్లమైంది. దాదాపు 50 శాతం కంటే తక్కువ మంది విద్యార్థులు రాయడం, చదవడం, చతుర్విధ ప్రక్రియలు చేయలేకపోతున్నారు. అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ కొంత మంది ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో కార్యక్రమాన్ని అమలుపర్చడం లేదు. దీంతో సర్కారు లక్ష్యం నీరుగారుతోంది.

విధులు వదిలి సొంత పనుల్లో..

సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసి వారి భవితకు బాటలు వేయాల్సిన కొంత మంది గురువులు సొంత పనుల్లో నిమగ్నమవుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం, చిట్టీలు నడపడం, కాంట్రాక్ట్ పనులు చక్కబెట్టుకుంటున్నారు. సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారు. ఇంకొంత మంది వంతుల వారీగా బడికి రావడంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందకుండా పోతుంది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడులకు పంపించేందుకు ఆసక్తి కనబర్చడం లేదని తెలుస్తోంది.

నమ్మకం కలిగేలా బోధించాలి



సర్కారు బడుల్లో చదివేది పేద విద్యార్థులే. మంచి బోధన అందించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి. గతం కంటే ప్రస్తుతం మెరుగైన మౌలిక వసతులు ఉన్నాయి. సర్కారు బడులపై నమ్మకం కలిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి. ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన చేయాలి. – పెరమండ్ల నారాయణ, మావల

బోధన మరింత మెరుగుపర్చాలి



నా ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. ప్రస్తుతం సర్కారు బడుల్లో మౌలిక వసతులున్నాయి. మరింత మెరుగుపర్చాలి. అలాగే ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన చేయాలి. చాలా మంది తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలంటే చిన్నచూపు ఉంటుంది. ఉపాధ్యాయులు ఆ అపోహలను తొలగించి నాణ్యమైన బోధన చేయాలి. – తోట విలాస్, విద్యార్థి తండ్రి, తాంసి

పర్యవేక్షణపై దృష్టి సారించాలి



అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి. ఎంఈవో, డిప్యూటీ ఈవో, డీఈవో పోస్టులు భర్తీ చేస్తేనే సర్కారు విద్య గాడిన పడుతుంది. డైట్ కళాశాలలో లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతుంది. వీటిపై దృష్టి సారిస్తే సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.

– బి.రవీంద్ర, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు


సర్కారు బడుల్లోనే చేర్పించాలి..



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లల్ని అందులోనే చేర్పించాలి. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు 97శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో 58 బడుల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నాం. మరింత నాణ్యమైన బోధన అందించేందుకు ఐదు రోజుల పాటు వారికి శిక్షణ కల్పిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టారు.

– ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో

‘యువ వికాసం’పై కసరత్తు



- నేటితో ముగియనున్న క్షేత్రస్థాయి పరిశీలన
- 13 నుంచి మండలస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
- 20 నుంచి జిల్లా స్థాయిలో గుర్తింపు

శాఖల వారీగా అందిన దరఖాస్తులు, పరిశీలన వివరాలు		
శాఖ	అందిన దరఖాస్తులు	పరిశీలించినవి
ఎస్సీ కార్పొరేషన్	9804	8143
ఎస్టీ సంక్షేమ శాఖ	12855	11039
బీసీ	18581	15773
ఈబీసీ	653	376
మైనార్టీ	5814	4364
క్రిస్టియన్ మైనార్టీ	55	32

కైలాస్‌నగర్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇందులో భాగంగా రూ.50వేల నుంచి రూ.4.లక్షల వరకు ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించింది. ఇందుకోసం గత నెల 7నుంచి 14వరకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించింది. జిల్లాలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఇందులో అర్హులను గుర్తించేందుకు చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలన ముమ్మరంగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల వివరాలు, స్థితిగతులను ఆరా తీస్తున్నారు. వారు ఎంపిక చేసిన జాబితాలను సోమవారం (నేటి)లోగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌కు అందజేయాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ సంక్షేమశాఖలన్నింటివి కలిపి 47,762 దరఖాస్తులు అందగా, ఇప్పటివరకు 39,727 పరిశీలించారు. మిగతా దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది. వాటి పరిశీలనను నేటితో పూర్తిచేసేందుకు అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ విషయమై కలెక్టర్ ఇటీవల సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లతో పలుమార్లు సమీక్షించారు. ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు.

13 నుంచి మండల స్థాయిలో..

ఎంపీడీవోలకు అందిన దరఖాస్తుల ఆధారంగా ఈనెల 13 నుంచి 19వరకు మండల స్థాయిలో లబ్ధిదారుల ఎంపికకు మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఎంపీడీవో నేతృత్వంలోని ఈ కమిటీలో ఎంపీవో, మండల ప్రత్యేక అధికారి, బ్యాంక్ మేనేజర్లు సంబంధిత శాఖల నుంచి ఎంపిక చేసిన అధికారులు ప్రాతినిధ్యం వహిస్తారు. సంక్షేమ శాఖలకు సంబంధించి మండల స్థాయి కమిటీలో హెచ్‌డబ్ల్యూవోలను నియమించారు. మున్సిపాలిటీలో గెజిటెడ్ అధికారులను కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. వీరి ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి మండలాలకు కేటాయించిన యూనిట్ల ఆధారంగా ఎంపిక చేయనున్నారు. ఇలా ఎంపిక చేసిన వారి వివరాలను జిల్లా కమిటీకి ప్రతిపాదిస్తారు. అయితే యూనిట్ల సంఖ్య తక్కువగా ఉండి, దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు తలనొప్పిగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అర్హులను గుర్తిస్తేనే నిరుద్యోగులకు లబ్ధి చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో కులాల వారీగా కేటాయించిన యూనిట్లు		
ఎస్సీ 2,662	ఎస్టీ 6,480	బీసీ 2,403
ఈబీసీ 724	ముస్లిం మైనారిటీ 1,003	
క్రిస్టియన్ మైనారిటీ 31		

20 నుంచి జిల్లా స్థాయిలో..

నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఈనెల 20 నుంచి 30 వరకు మండల కమిటీలు అందజేసిన అర్హుల వివరాలను జిల్లా కమిటీ పరిశీలిస్తుంది. ఈ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా, అడిషనల్ కలెక్టర్ వైస్ చైర్మన్‌గా, డీఆర్డీవో నోడల్ అధికారిగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల అధికారులు, బ్యాంకు ఉన్నతాధికారులు కమిటీ సభ్యులుగా ఉండనున్నారు. ఈ కమిటీ మండల స్థాయి నుంచి అందిన దరఖాస్తులను, వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. అర్హత ఆధారంగా యూనిట్ల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేయనుంది. ఈ ప్రక్రియను ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు పూర్తి చేయనుంది. ఆయా తేదీల్లోనే ప్రొసీడింగ్‌లను సైతం సిద్ధం చేయనుంది. జిల్లా కమిటీ ఎంపిక చేసిన లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు పత్రాలు అందజేయనున్నారు. తొలివిడతలో రూ.50వేలు, రూ.లక్ష లోపు రుణాలు అందజేయనున్నట్లుగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారి సంఖ్య తక్కువగా ఉండటంతో తొలివిడతలోనే వారికి లబ్ధి చేకూరే అవకాశముంది.

పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ

రాజీవ్ యువ వికాసం పథకం కింద ప్రభుత్వ ఆర్థికసాయం కోసం అందిన దరఖాస్తులకు సంబంధించిన వివరాల క్షేత్రస్థాయి పరిశీలన సోమవారంలోగా ముగియనుంది. ఈ నెల 13 నుంచి 20వరకు మండల స్థాయిలో లబ్ధిదారుల ఎంపికకు మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు ఉంటాయి. 20 నుంచి 30వరకు జిల్లా స్థాయిలో ఎంపిక ప్రక్రియ పూర్తవుతుంది. కలెక్టర్ నేతృత్వంలో పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. ఎంపికైన లబ్ధిదారులకు జూన్ 2న రుణ మంజూరు పత్రాలు అందించేలా ముందుకు సాగుతున్నాం. – మనోహర్‌రావు, రాజీవ్ యువ వికాసం జిల్లా కన్వీనర్

ఆ వ్యాపారులకు సహకరిస్తే కేసులు

- కలెక్టర్ రాజర్షి షా
- జొన్నల విక్రయాలపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో జొన్నలు విక్రయించే వ్యాపారులకు సహకరించే రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. జొన్నల కొనుగోళ్లపై సంబంధిత శాఖ అధికారులతో ఆదివారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 15 కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలిపారు. క్వింటాల్‌కు రూ.3,371 మద్దతు ధరతో రైతుల నుంచి విక్రయిస్తున్నట్లు తెలిపారు. అయితే కొంతమంది వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు జొన్నలను తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. విజిలెన్స్ బృందాల ద్వారా నిరంతర నిఘా ఉంచినట్లు తెలిపారు. అక్రమంగా తీసుకువస్తే జొన్న బస్తాలతో పాటు వాహనాలను సీజ్ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఇప్పటికే భీంపూర్ మండలంలో రెండు బొలేరో వాహనాలు, ట్రాక్టర్, అలాగే ఇచ్చోడలోని మాదాపూర్‌లో 500 బస్తాల జొన్నలు, ఇంద్రవెల్లిలో 87 బస్తాలు, బజార్‌హత్నూర్‌లో 54 బస్తాలను సీజ్ చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 7780 మంది రైతుల నుంచి రూ.83.21 కోట్ల విలువైన 2.46లక్షల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు వివరించారు. సమావేశంలో డీఏవో శ్రీధర్ స్వామి, డీసీవో మోహన్, మార్కెటింగ్ అధికారి గజానంద్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైనికుల సేవలు చిరస్మరణీయం



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న జోగు రామన్న, శంకర్‌దాస్ తదితరులు

ఆదిలాబాద్: భారత్–పాకిస్తాన్ సరిహద్దులో విధి నిర్వహణలో వీరమరణం పొందిన సైనికుల సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన భారతీయులు, సరిహద్దుల్లో మరణించిన సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం వినాయక్ చౌక్‌లోని కార్గిల్ అమరవీరుల స్తూపం వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న సైనికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఇందులో సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్ దాస్, మజారుద్దీన్, వామన్‌రెడ్డి, రమేశ్, వినోద్, నాయకులు అలాల్ అజయ్, మెట్టు ప్రహ్లాద్, యూనుస్ అక్బానీ, కస్తాల ప్రేమల, చందాల రాజన్న, దాసరి రమేష్, సలీం పాషా, కొండ గణేశ్ తదితరులున్నారు.

భూసర్వే సమస్యకు ఇక చెక్



- త్వరలోనే లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 17వరకు గడువు

శిక్షణ ఫీజు వివరాలు	
అభ్యర్థులు	ఫీజు
ఓసీ	రూ.10వేలు
బీసీ	రూ.5వేలు
ఎస్సీ, ఎస్టీ	రూ.2,500

కైలాస్‌నగర్: జిల్లాలో సర్వేయర్ల కొరత వేధిస్తోంది. సరిపడా లేకపోవడంతో భూసర్వే పనులకు ఆటంకం కలుగుతుంది. ధరణితో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు మండల సర్వేయర్ల కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. దరఖాస్తు చేసుకుని నెలలు గడిచినా సర్వేయర్ వచ్చే పరిస్థితి లేదు. ఈ ఇక్కట్లను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై దృష్టి సారించింది. ప్రైవేట్ సర్వేయర్లతో పాటు ఆసక్తి, అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇచ్చి లైసెన్స్‌లు జారీ చేయాలని నిర్ణయించింది.

మండలానికి కనీసం ఇద్దరు ఉండేలా ...

భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై దృష్టి సారించింది. 60 శాతం మార్కులతో గణితం ఓ సబ్జెక్టుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారు, ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్(సివిల్), డిప్లొమా, బీటెక్ సివిల్ లేదా తత్సమాన అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. పాత సర్వేయర్లతో పాటు ఆసక్తి గల వారు ఈ నెల 17లోపు మీసేవ కేంద్రాల్లో రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందులో అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి ఈ నెల 26 నుంచి జూలై 26వరకు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఒక్కో మండలానికి కనీసం ఇద్దరు చొప్పున నియమించనున్నట్లుగా తెలుస్తోంది.

మూడు విడతల్లో శిక్షణ ...

ఎంపిక చేసిన వారికి మూడు దశల్లో శిక్షణ ఇవ్వనున్నారు. థియరీ, టిప్పన్ ప్లాటింగ్, ఫీల్డ్ లెవల్‌లో ట్రెయినింగ్ ఉంటుంది. అనంతరం 40 రోజుల పాటు మండల సర్వేయర్ కింద ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. విజయవంతంగా పూర్తి చేసిన వారికి జిల్లా స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ఫైనల్ అసెస్‌మెంట్ టెస్టు నిర్వహిస్తారు. ప్రతిభ కనబరిచిన వారికి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ద్వారా లైసెన్స్‌లు జారీ చేస్తారు. అలాంటి వారికి రైతుల భూములను సర్వే చేసేందుకు అధికారికంగా గుర్తింపు లభించనుంది.

సర్వేయర్ల కొరత లేకుండా ...

ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలో సర్వేయర్ల కొరత తీరనుంది. ప్రస్తుతం 21 మండలాలకు గాను 8మంది మండల సర్వేయర్లు, ఇద్దరు డిప్యూటీ సర్వేయర్లు మాత్రమే పనిచేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టంతో జిల్లాలో భూ సమస్యలు కుప్పలుగా పేరుకుపోయాయి. ల్యాండ్ మిస్సింగ్, పట్టాదారు పేరు తారుమారు, విస్తీర్ణంలో తేడా వంటి అనేక సమస్యలున్నాయి. దీంతో సర్వే కోసం అందిన దరఖాస్తులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి తోడు రియల్ ఎస్టేట్ కారణంగా జిల్లాలో వ్యవసాయ భూములు పెద్ద ఎత్తున వెంచర్లుగా మారుతున్నాయి. నాలా కన్వర్షన్ కోసం సైతం అప్లికేషన్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులోకి వస్తే భూసర్వే పనులు వేగవంతంగా సాగే అవకాశముంది.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న భూభారతి చట్టంలో అర్హులైన వారి సేవలను సర్వేయర్లుగా వినియోగించుకోవాలని భావిస్తోంది. వారికి శిక్షణ ఇచ్చి లైసెన్స్‌లు జారీ చేయనుంది. నిరుద్యోగ యువతకు ఇది మంచి అవకాశం. అర్హులైన వారు ఈనెల 17వరకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. – ఎం.రాజేందర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ, ఆదిలాబాద్

క్లుప్తంగా

ఆదివాసీలు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న రాహుల్ బల్

జన్నారం: ఆదివాసీలను చైతన్యపర్చి రాజకీయంగా ముందుకు తీసుకురావడానికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ జాతీయ ఆదివాసీ ప్రోగ్రాం కన్వీనర్ రాహుల్ బల్ అన్నారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ఆదివాసీలు రాజకీయంగా ఎదగలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు రాజకీయంగా ఎదిగేందుకు శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, కాంగ్రెస్ పార్లమెంటరీ నాయకురాలు ఆత్రం సుగుణ, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

వడదెబ్బతో యువకుడి మృతి



గొంతయ్య (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లికి చెందిన మానెపల్లి గొంతయ్య(18) వడదెబ్బ కు గురై మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గొంతయ్య..కాగజ్‌నగర్ పట్టణంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఇంటి వద్ద కూలీ పని వెళ్తున్నాడు. ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని బూరుగూడ పరిధిలోని బీఈడీ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం..మండలంలోని జన్కాపూర్‌కు చెందిన అబ్దుల్లా బిన్ సాల్‌హే (42) తనసొంత పని నిమిత్తం కాగజ్‌నగర్‌కు సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుంటూ కారులో వెళ్తున్నాడు. బీఈడీ కళాశాల సమీపంలో డీవైడర్‌ను ఢీకొట్టడంతో ఆయన కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో అతన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనలతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, మృతుడు అడ బ్రాంచి పోస్టుమాస్టర్‌గా పని చేస్తున్నాడు. భార్య ఆస్మాబేగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నారు.

మానవతామూర్తులు

- వైద్యరంగంలో నర్సుల పాత్ర కీలకం
- నిరంతరం రోగులకు సేవలు
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

వైద్యరంగంలో నర్సులు.. కనిపించే దేవతలు.. సేవామూర్తులు. కాలిన గాయాలతో దవాఖానలకు వచ్చే బాధితులైనా.. రోడ్డు ప్రమాద క్షతగాత్రులైనా.. పురిటినొప్పులతో వచ్చే గర్భిణులైనా.. మరి ఇంకెవరైనా తోబుట్టువులా మొదట పలుకరించేది వాళ్లే. రోగులే దైవంగా సేవలందిస్తూ వైద్య రంగానికే వన్నె తెస్తుండగా, నేడు (సోమవారం) అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– నిర్మల్‌చైన్‌గేట్/ఆసిఫాబాద్‌అర్బన్





ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్స్(ఫైల్)

ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా

నర్సింగ్ వృత్తికి హుందాతనం తెచ్చిన ఫ్లోరెన్స్ నై టింగేల్ జయంతిని పురస్కరించుకుని ఏటా మే12 న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆరోగ్య రక్షణలో నర్సులు అందించిన కృషిని తలుచుకుంటూ ఏటా వేడుకలు జరుపుకుంటున్నారు. ఈక్రమంలో ఏటా నర్సింగ్ విభాగంలో వి శిష్ట సేవలు అందిస్తున్న నర్సులకు రాష్ట్రపతి అవా ర్డులు అందించి సముచితంగా సత్కరిస్తున్నారు.

నైటింగేల్ స్ఫూర్తితో..



నైటింగేల్ స్ఫూర్తితో విధులు నిర్వహిస్తున్నా. జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలందిస్తున్నా. ఆపదలో ఉన్న వారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. 2023లో నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్నా.

– విజయలక్ష్మి, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్, జిల్లా జనరల్ ఆస్పత్రి

అదృష్టంగా భావిస్తున్నా



నర్సింగ్ వృత్తిలో కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నా. నర్సుగా పనిచేస్తూ ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చు. రోగులకు సేవ చేయడం కోసం ఈ వృత్తిని ఎంచుకున్నా. 25 ఏళ్లుగా రోగులకు సేవలందిస్తూ ఐదు సార్లు జిల్లా కలెక్టర్‌తో ఉత్తమ పురస్కారం అందుకున్నా.

– అన్నపూర్ణ, హెడ్‌నర్స్, సీహెచ్‌సీ నర్సాపూర్(జి)

సేవ చేస్తున్నా



రోగులకు సేవ చేయడం దేవుని సేవగా భావిస్తున్నా. కరోనా సమయంలో విధులకు వెనుకాడలేదు. ఆపదలో ఉన్నవారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. రోగులందరిని కుటుంబ సభ్యులుగా భావిస్తా. అందుకే రోగం ఎంత భయాంకరమైనదైనా సేవచేయగలుగుతున్నా.

– పుష్పలత, హెడ్‌నర్స్, జిల్లా జనరల్ ఆసుపత్రి

ఆత్మీయ పలకరింపు



అన్ని ఉద్యోగాలకంటే ఉన్నతమైన వృత్తి నర్సు. వ్యాధి నయమయ్యాక రోగే పిలిచే ఆత్మీయ పలకరింపు గొప్ప ఆనందాన్నిస్తుంది. దీని ముందు ఏదైనా తక్కువే.

భూలక్ష్మి స్టాఫ్‌నర్స్, జిల్లా జనరల్ ఆసుపత్రి

ఇష్టంతో విధులు



ఆసిఫాబాద్‌అర్బన్: 35 ఏళ్లుగా నర్సింగ్ వృత్తిలో కొనసాగడం గర్వంగా ఉంది. ఇష్టంతోనే విధులు నిర్వహిస్తున్నాం. కుటుంబ సభ్యుల సహకారంతో రోగులకు సేవలందిస్తున్నాం. కరోనా సమయంలో చికిత్స అందించాం. ప్రభుత్వం తమను గుర్తించి పారితోషికం ప్రకటించాలి.

– ఇందుమతి, నర్సింగ్ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

సేవలకు గుర్తింపు



1993లో విధులో చేరాను. మారుమూల ప్రాంతాల పీహెచ్‌సీల్లో ప్రజలకు సేవలు అందించడం తృప్తినిచ్చింది. విధుల్లో రోగులకు సేవ చేయడంతో గుర్తింపు ఉంది. కోవిడ్ బాధితులకు సేవల అందించాను. గ్రామీణులకు సేవ చేయడం సంతోషంగా ఉంది.

– సఫియా బేగం హెడ్‌నర్సు

పారితోషికం ఇవ్వాలి



రాత్రింబవళ్లు రోగులకు సేవలందిస్తున్న నర్సులకు ప్రభుత్వం పారితోషికం అందించాలి. ఆసుపత్రికి వచ్చే వారు మద్యం మత్తులో ఇష్టారాజ్యంగా మాట్లాడినా వారిని ఓపికతో సర్దిచెప్పి చికిత్స చేసి పంపిస్తాం. ఖాళీల కొరతతో పని భారం పెరుగుతుంది. నర్సు పోస్టులను భర్తీ చేయాలి. మొదట ఆశవర్కర్‌గా పని చేశాను. భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ వృత్తిలో చేరాను.

– హేమలత, నర్సింగ్ ఆఫీసర్

తృప్తినిస్తుంది



ప్రతీరోజు రోగులకు సేవ చేయడం తృప్తినిస్తుంది. భర్త ప్రోత్సాహంతో నర్సింగ్ ఉద్యోగాన్ని సాధించాను. అత్యవసర సమయంలో వైద్యం చేసే నర్సులకు ప్రత్యేక పారితోషికాలు ఇవ్వాలి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – కవిత, నర్సింగ్ ఆఫీసర్

వసతులు కల్పించాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో నర్సులకు వసతులు కల్పించాలి. రాత్రివేళ విధులు నిర్వహించేవారికి సెక్యూరిటీ ఇవ్వాలి. ఉన్నతాధికారుల సలహాలతో రోగులకు సేవలందిస్తున్నాం. ఈ వృత్తిలోకి రావడానికి ముందు హైదరాబాద్ కేర్ ఆసుపత్రిలో పనిచేశాను. ఆ అనుభవంతో ఉద్యోగం సాధించాను. – ఆర్.సునీత, నర్సింగ్ ఆఫీసర్

ఎలాంటి ఇబ్బంది లేదు



రోగులకు సేవలు చేయడం అదృష్టంగా భావిస్తాను. ప్రస్తుతం విధ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేదు. ఆసుపత్రి సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆదేశాలతో రోగులకు సేవలు చేస్తున్నాను. ఉద్యోగ రీత్యా కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిది. కరోనా సమయంలో పేషంట్లకు సేవ చేయడం జీవితంలో మరువలేనిది. పూర్తిస్థాయిలో వైద్యులు నియమించాలి.

– స్రవంతి, నర్సింగ్ ఆఫీసర్

ఆనందంగా ఉంది



పేదలకు వైద్య సేవలందించడం ఆనందంగా ఉంది. గ్రామీణప్రాంతాల నుంచి వైద్యం కోసం ఇక్కడికి ఎంతోమంది వస్తున్నారు. వారిని మా కుటుంబ సభ్యులుగా భావించి సేవ చేస్తున్నాం. ప్రతీ రోగిపై శ్రద్ధపెడుతూ వైద్యం అందిస్తాం. రేయింబవళ్లు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయడం సంతృప్తినిస్తుంది.

– మంజుల, స్టాఫ్‌నర్స్, ఖానాపూర్

సేవచేసే భాగ్యం



రోగులకు సేవ చేస్తే దేవునికి సేవ చేసినట్లే. ఆ అవకాశం కేవలం నర్సులకే దక్కుతుంది. రోగులకు సేవ చేయడంలో ఉన్న ఆనందం దేంట్లో ఉండదు. నర్సింగ్ వృత్తిలో మంచి సంతృప్తిని పొందుతున్నా.

– కవిత, స్టాఫ్‌నర్సు, భైంసా

ఇష్టంగా వైద్యసేవలు



నర్సుగా విధుల్లో చేరిన ప్పటి నుంచి ఇష్టంగా రోగులకు వైద్యసేవలుఅందిస్తున్నా. అప్పుడే పుట్టిన చిన్నపిల్లలకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. నర్సులందరికీ నైటింగేల్ స్ఫూర్తి కావాలి.

– మనీషా, స్టాఫ్‌నర్స్ జిల్లా ప్రసూతి ఆసుపత్రి

అందరికీ అవకాశం దక్కదు



సేవచేయాలన్న కోరిక ఉన్నా అందరికీ ఆ అవకాశం దక్కదు. ఆసుపత్రికి వచ్చేవారిని రోగులుగా కుటుంబ సభ్యులుగా భావించి సేవలు అందిస్తున్నాం. త్వరగా వ్యాధి నయమై వెళ్లాలని కోరుకుంటాం.

– శృతి, జిల్లా ప్రసూతి ఆసుపత్రి

పాలిసెట్‌కు సర్వం సిద్ధం

- రేపే ప్రవేశ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 28 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 8195 మంది విద్యార్థులు

బెల్లంపల్లి: రాష్ట్రంలో ఉన్న సాంకేతికవిద్య కళాశాలల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 13న పాలిసెట్–2025 పరీక్షకు సర్వం సిద్ధమైంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, వాంకిడి, మంచిర్యాల, బెల్లంపల్లిలో మొత్తం 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 8,195 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ప్రవేశ పరీక్షఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరగనుంది. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష ఆయా కేంద్రాల్లోకి చేరుకోవాలి. పరీక్ష ప్రారంభమైన ఒక్కనిమిషం ఆలస్యమైన కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష సమయానికి ముందస్తుగానే కాలకృత్యాలు తీర్చుకుని రావల్సి ఉంటుంది. మధ్యలో వెళ్లే పరిస్థితి లేదు.

విద్యార్థులు పాటించాల్సిన సూచనలు..

- పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, ప్యాడ్, హెచ్‌బీ పెన్సిల్, షార్పనర్, ఎరేజర్, నీలం లేదా నలుపు బాల్ పాయింట్ పెన్ తెచ్చుకోవాలి.
- రఫ్ వర్క్ కోసం ప్రశ్నాపత్రంలో చివర రెండు ఖాళీపేజీలు అందుబాటులో ఉంటాయి. బయటి నుంచి కాగితాలు తీసుకురావొద్దు.
- హాల్‌టికెట్‌పై ఫొటోలేని విద్యార్థులు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణపత్రంతో పరీక్షకు హాజరు కావాలి.
- సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, వాచీలు, తదితర తీసుకురావడానికి అనుమతి లేదు.



బెల్లంపల్లి బజారుఏరియా హైస్కూల్ పరీక్ష కేంద్రం

ప్రశాంతంగా పరీక్ష రాయాలి



విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దు. పరీక్ష కేంద్రంలో చేతికి ప్రశ్నాపత్రం అందజేసిన తర్వాత ముందస్తుగా సూచనలు చదివి అనుసరించాలి. ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలి. చదివిన అంశాలను గుర్తు చేసుకుని జవాబులు రాస్తే పరీక్షలో నెగ్గడానికి వీలుంటుంది.

– డాక్టర్ ఎం.దేవేందర్, మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	విద్యార్థులసంఖ్య	పరీక్ష కేంద్రాలు
ఆదిలాబాద్	1,102	03
నిర్మల్	2,422	08
కుమురం భీం ఆసిఫాబాద్ (వాంకిడి సెంటర్‌కలుపుకుని)	1,032	04
మంచిర్యాల	2,558	10
బెల్లంపల్లి	1,081	03

'అల్ఫోర్స్' విద్యార్థులకు అభినందన



కరీంనగర్: ఈఏపీసెట్- 2025 ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో సత్తా చాటిన 'అల్ఫోర్స్' విద్యార్థులను ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి ఆదివారం అభినందించారు.

'ట్రినిటి' విజయభేరి



కరీంనగర్: ఈఏపీసెట్ ఫలితాల్లో కరీంనగర్ ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు 405, 430, 560, 697, 730, 760, 791, 859, 934,1104, 1166, 1546, 1619, 1795, 1950తో పాటు మొత్తం 89మందికి పైగా విద్యార్థులు 10వేలలోపు ర్యాంకులు సాధించారు. విద్యార్థులను విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ట్రినిటి జూనియర్ కళాశాలలు విద్యా రంగంలో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయని తెలిపారు. ఐఐటీ–జేఈఈ(మెయిన్స్), అడ్వాన్స్‌డ్, నీట్, ఈఏపీసెట్ వంటి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించారని ప్రశంసించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అభినందించారు. ఈ విజయానికి బాటలు వేసిన అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు.

'శ్రీ చైతన్య' ర్యాంకుల ప్రభంజనం



జి.వైష్ణవి



బి.మనోఘ్న

కరీంనగర్: ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. గోకులకొండ వైష్ణవి 810, బి.మనోఘ్న 968, బి.సాత్విక్ 1,142, పి.స్ఫూర్తిశ్రీ 1,527, బి.శ్రావణి 1,803, పి.బ్లెస్సీ సుసన్ 2,106, పి.చందన 2165, పి.భరత్‌రెడ్డి 2,815, పి.అజితేష్ 3,016, కె. అనూహ్య 3,503, వి. ప్రవీణ్ 3,623, డి.రిషి 3,996, జి.అర్చన 4,171, ఆర్.శ్రేయాన్ 4,246, వి.శివాణి 4,570, బి.స్రవంతి 4,957, 5000 లోపు 16 ర్యాంకులు, 10000 ర్యాంకుల లోపు 51 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు. కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



25 ఏళ్ల తర్వాత మళ్లీ బడికి

దండేపల్లి మండలంలోని ద్వారక జే.వీ.ఎన్ఆర్ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత అదే బడిలో కలుసుకున్నారు. ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. – దండేపల్లి

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

తానూరు: మండలంలోని బెల్‌తరోడా సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. ట్రైనీ ఎస్సై నవనీత్‌రెడ్డి కథనం ప్రకారం.. కుంటాల మండలం లింబా (బి) గ్రామానికి చెందిన సంజీవ్ (30) ఆదివారం తానూరు మండలం బెంబరలో నిర్వహించిన అంత్యక్రియలు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి తిరుగుపయనమయ్యాడు. ఈ క్రమంలో చెట్టుకు ఢీకొని మృతిచెందాడు. సమాచారం అందుకున్న ట్రైనీ ఎస్సై.. ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మద్యం మత్తులో ఉండడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్‌హెచ్-44పై దారికాచిన మృత్యువు

- మూడు జిల్లాల పరిధిలో మూడు యాక్సిడెంట్లు
- నిర్మల్ జిల్లాలో తండ్రి, కూతురు దుర్మరణం
- ఆదిలాబాద్ జిల్లాలో బావ మృతి, బావమరిదికి గాయాలు..
- కామారెడ్డి జిల్లాలో భార్య మృతి, భర్తకు గాయాలు
- మూడూ కారు ప్రమాదాలే కావడం విషాదం..

కశ్మీర్ నుంచి కన్యాకుమారిని కలిపే ఎన్‌హెచ్ 44పై ఆదివారం మృత్యువు దారికాచింది. మూడు జిల్లాల పరిధిలో ఇదే రోడ్డుపై జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. ఇక్కడ విషాదం ఏమిటంటే మూడు ప్రమాదాలకు కారణం కార్లే.. మూడు ప్రమాదాలు కారు డ్రైవర్ల తప్పిదంతోనే జరిగాయి. నిర్మల్ బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఆగిఉన్న ఐచర్ వాహనాన్ని కారుడ్రైవర్ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో తండ్రి, కూతురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బావ మృతి చెందగా, బావమరిది గాయపడ్డాడు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ సమీపంలో కారు అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలయ్యాయి. ఈ మూడు ప్రమాదాలు ఆ కుటుంబాల కలలను, ఆశలను ఛిన్నాభిన్నం చేశాయి.

నిర్మల్ జిల్లాలో..



శంకర్, కృతిక(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రవీంద్రనగర్‌కు చెందిన బండి శంకర్(48) బ్యాటరీ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని సంతోషంగా చూసుకునేవారు. ఆయనకు కవల ఆడపిల్లలు వైదిక, కృతిక(22) ఉన్నారు. వైదిక నిజామాబాద్‌లో వైద్య విద్య అభ్యసిస్తుండగా, కృతిక హైదరాబాద్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శనివారం కృతిక పరీక్షలు పూర్తి కావడంతో వేసవి సెలవుల కోసం ఇంటికి తీసుకురావడానికి శంకర్ తన సొంత కారులో డ్రైవర్ విలాస్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం రాత్రి కృతికను తీసుకుని ఇంటికి బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో నిర్మల్ జిల్లా నీలాయిపేట వద్ద వారు ప్రయాణిస్తున్న కారు, రోడ్డుపై ఆగి ఉన్న ఐచర్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. శంకర్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన కృతికను స్థానికులు నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు, ఆమె అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. డ్రైవర్ విలాస్ కాళ్లకు తీవ్ర గాయాలై, చికిత్స కోసం మహారాష్ట్రలోని ఆస్పత్రికి తరలించారు. మరో గంటలో ఇంటికి చేరి, కుటుంబంతో సంతోషంగా గడపాలన్న కృతిక ఆశలు ఈ ప్రమాదంతో ఆవిరయ్యాయి. తండ్రి, కూతురు మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగారు. వారి రోదనలు చూసినవారిని కంటతడి పెట్టించాయి.

ఆదిలాబాద్ జిల్లాలో

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద జరిగిన మరో ప్రమాదంలో వెంకటేశ్(35) మృతిచెందాడు. నిర్మల్ జిల్లా వివేక్‌నగర్‌కు చెందిన వెంకటేశ్, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అన్వేష్ బావ, బావమరిది. పని నిమిత్తం శనివారం ఆదిలాబాద్‌కు వెళ్లిన వెంకటేశ్ ఆదివారం బావమరిదితో కలిసి నిర్మల్‌కు బయల్దేరాడు. టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని వారి కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్ తీవ్రంగా గాయపడి, నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అన్వేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో..



ప్రణీత మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి వద్ద గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయర్ ప్రణీత (20) మృతి చెందింది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కంఠం గ్రామానికి చెందిన అమూల్ నేవీలో విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తున్నారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో సెలవులు రద్దు కావడంతో, ఆదివారం సాయంత్రం భార్య ప్రణీతతో కలిసి కారులో బయల్దేరారు. మార్గమధ్యంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రైలింగ్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ప్రణీత తీవ్రంగా గాయపడగా, అమూల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ప్రణీత మృతిచెందింది. అమూల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అమూల్, ప్రణీతకు ఏడాది క్రితం పెళ్లయింది.